# స్వభావం

**జింకా నాగరాజు**

రావు గారు పెద్ద పోలీసాఫీసర్

లుంగీ బనీనుతో ఇంటి ఆవరణ లాన్‌లో ఈజీ చేర్ వేసుకుని కూర్చున్నా,


పొద్దునే కాలేజీ గ్రౌండ్స్‌లో జాగింగ్ చేస్తున్నా రావుగారిని చూస్తూనే ఆయన పోలీసాఫీసరు అని టకీమని గుర్తుపట్టవచ్చు.

దేవతలకు తలవెనక కాంతివలయం ఉన్నట్లు రావుగారి తల చుట్టూ పోలీసు కాంతి వలయం కనిపిస్తుంది.

ఎండిపోయిన పెయింట్ బ్రష్‌మీసాలు, పోలీసులకు మాత్రమే ఉండాల్సిన ఛాతీ, ఎత్తు, ఎంత లావు ఉంటే పోలీసులా కనబడతారో అంతేలావు, పోలీసుకంచు కంఠం. రావు గారు అచ్చోసిన పోలీసులాగా ఉంటారు.

ఆయన ఆకారం చూసి ఆయనను ఐపిఎస్ లోకి తీసుకున్నారో లేక ఆయన ఐపిఎస్ అయిన తర్వాత అలా పోలీసు లాగా మారారో... ఈ మధ్యే ఆయనతో పరిచయంకలిగిన నా లాంటి వ్యక్తి చెప్పడం కష్టం. దానికితోడు ఆయన నాకు పరిచయం అయింది మఫ్టీలోనే.

నిజం చెబుతున్నాను, ఆయనను నేను ఇంతవరకు యూనిఫారంలో చూసే అవకాశం రాలేదు. అయితే పోలీసుల గురించి బాగా తెలుసుకాబట్టి, పోలీసు యూనిఫారంలో ఆయన ఎలా ఉంటారో నేను సులభంగా వూహించుకోగలను. పరిచయం అయినప్పటినుంచి ఆయన మాట్లాడే ధోరణి, కొత్త వాళ్లువచ్చినపుడు వారిని రసీవ్ చేసుకునే తీరు ,బయట ఎక్కడో దాక్కున్న కానిస్టేబుల్‌ను పిలిచేతీరు, ఫోన్ రిసీవర్ పట్టుకునే పద్ధతి, అవతలివ్యక్తిని 'హలో ' అని పిల్చడంలోను (ఆయన హలోని ధ్వనిని అక్షరాలలో పెట్టడం కష్టం), చివరకు ఆయన ఎదుటి వారిని 'బాగున్నారా' అడిగే విధానం ...వగైరా చూసిన తర్వాత రావు గారు 'పోలీసు'లో జీవిస్తున్న వారనిపించింది.



ఆయన మీద నాకు ప్రత్యేక గౌరవం కలిగేందుకు కారణం ఈ స్వభావమే.

ఏ ఉద్యోగంలో ఉన్నా,ఏపని చేసినా స్వభావాన్ని జీర్ణించుకోవాలి. నటులు పాత్రల స్వభావాన్ని జీర్ణించుని ఆ పాత్రలలో జీవించిన తర్వాతే మహానటు లవుతారని మనకు తెలిసిందే. ఇదే స్వభావం ఆయనలో ఉంది. ఇదే నాకు ముచ్చటేసిన విషయం. చిత్రమేమంటే ఇన్ని పోలీసు లక్షణాలను పుణికి పుచ్చుకున్నా ,రావు గారిలో పోలీసులకు ఉండకూడని లక్షణాలు కూడా ఉన్నాయి. వాటిని పోలీసు అవలక్షణాలు అనవచ్చు. అయితే, ఈ అవలక్షణాల వల్ల ఆయన పోలీసులలో గంజాయి మొక్క అయే ప్రమాదం ఉంది. దీనిని పసిగట్టలేనంత అమాయకుడు కాదు రావు గారు. అందుకే ఈ అవలక్షణాలను కూడా ఆయన పోలీసీకరించి జీర్ణించుకున్నారు. ఆయనకు ఉన్న సాహిత్యాభిమానమే ఈ అవలక్షణం. ప్రపంచ సాహిత్యంలో మంచి మంచి పుస్తకాలు ఎక్కడ ఉన్నా, ఎంత ఖరీదయినా తెప్పించుకుని చదవుతారు. అంతేకాదు, ఫలానా పుస్తకం చదివారా అని మనల్ని అడిగి , చదవకపోతే 'చదువు' అని నయాన చెప్పడమే కాదు, 'చదవకపోతే భస్తావ్' అని సుతిమెత్తగా హెచ్చరిస్తారు కూడా. డ్యూటీలో లాఠీ మఫ్టీలో పుస్తకం ఆయన ఆయుధాలు అని ఎవరో అభిమాని చమత్కరిస్తే దానిని ' ఒక చేత్తో లాఠీ, మరొక చేత్తో పుస్తకం' అని తానే సవరించారని చెబుతారు. అంతేకాదు ,అవసరమయితే లాఠీని గిరవాటేస్తా గాని పుస్తకం వదలనని కూడా ఆయన చెప్పారట. ఆయన మాటలోనే చెబితే పుస్తకం ఆయన వూపిరి.

' ఈ పుస్తకాల పిచ్చి ఇప్పటిదా ...' అని ఒక సారి పోలీసు నవ్వు నవ్వి

'....బరోడా యూనివర్శిటీలో ఎకనోమెట్రిక్స్ ఎం.ఎ చదువుతున్నపుడు...ఇదెప్పటి మాట. నైన్‌టీన్ సిక్స్‌టీ ఫోర్... పరీక్షల కోసం టెక్స్‌ట్ పుస్తకాలు చదివిందెవుడు? పరీక్షలు వారం రోజులున్నాయన్నపుడు వూర్లో ఉన్న పుస్తకాల షాపులన్నీ వెదికి ఒక అరడజన్ టెక్స్‌టు పుస్తకాలు కొని రేయింబగలు చదివి ఫస్ట్ క్లాస్ తెచ్చుకోవడం. మిగాతా ఎడాది జీవితం షెక్స్‌పియర్, మిల్టన్, హోమర్. పగలు షెక్స్‌పియర్, రాత్రి మిల్టన్, తెల్లవారు జామున బ్లాక్‌పోయట్రీ, సాయంకాలం లాటిన్ అమెరికన్ ఫిక్షన్. ఎస్...రియల్లీ వన్ షుడ్ బర్న్ విత్ దట్ పాషన్. నాకు దివ్యదృష్టి మీద నమ్మకం లేదు. అయితే చదవడం వల్ల దివ్యదృష్టి వస్తుందంటాను. యు కెన్ ఈ వెన్ హియర్ ది ట్రెమర్స్ అఫ్ ఎర్త్.' అని ఆయన తన అలవాటు గురించి నాకే కాదు చాలామందితో కూడా చెప్పారు.

'పుస్తకం' పేరెత్తితే లాఠీ చార్జిచేస్తాడని కొందరంటారు గాని దానిని నేనొప్పుకోను. పుస్తకాలు తానే కాదు అందరు చదవాలన్నదే ఆయన కోరిక.

అలాంటపుడు ఇలాంటి అన్‌చారిటబుల్ కామెంట్ చేయడం అన్యాయం . అట్లాగే, తాను ఏదయినా కొత్త పుస్తకంలోని సంగతులు చెప్పినా అందులో పోలీసు పరుషం ఉంటుందనే మాట కూడా నేనొప్పుకోను. చాలామందికి పోలీసులపట్ల ఉన్న వ్యతిరేకత వల్ల వచ్చిన దోషం ఇది. పోలీసులు సాహిత్యం చదువకూడదు అనే నినాదానికి ఇది దారితీస్తుంది. ఎపుడయినా ఎవరయినా పోలీసధికారి రెండు మాటలు

చెబితే  వినాలని నేను అంటాను .అంతే తప్ప ‘ ఇదిగో ఇందులో కూడా పోలీసు ధ్వని ఉంది అంటే మనమేం చేయగలం. ఇలాంటి ధోరణి నాకు నచ్చదు. మిత్రులందరికి నా సలహా ఒక్కటే. నాణేనికి రెండు పార్శ్వాలున్నట్లు, పోలీసుకు డ్యూటీ, మఫ్టీ అని రెండు పార్శ్వాలుంటాయి. సో,వన్ మస్ట్ బి ఫెయిర్ ఎనఫ్ టు అప్రీషియేట్ దిస్ హార్డ్ ఫ్యాక్ట్.

ఎవరేమన్నాసరే రావు గారంటే నాకు ప్రత్యేకాభిమానం.

చేసేది ఏ ఉద్యోగమయినా కానీవండి, అందులో జీవించేవారు ఎంతమంది?

బ్రిటిష్ కాలంలో డిపార్టుమెంట్ మొదలయినప్పటి నుంచి ఐడెండిటి కోల్పోని ఒకే ఒక శాఖ పోలీసు శాఖే. యూనిఫారం క్లాత్ మారింది తప్ప స్వభావం మారలేదు. ప్రతి డిపార్ట్‌మెంట్‌కు ఒక కల్చర్ ఉంటుంది. దీనిని అందులోని ఉద్యోగులు కాపాడుకోవాలి. ఇది పోలీసులలోనే కనబడుతుంది. మరో శాఖలో లేదు. బడిలో పాఠాలు చెప్పాల్సిమాస్టారు ఎల్‌ఐసి ఏజంటు అవతారమెత్తిన సంఘటనలు ఎన్నిలేవు? వైద్యం చేయాల్సిన డాక్టర్ వృత్తిమానేసి ట్యుటోరియల్ కాలేజీలను నడపడంలేదు. ఆ మాటకొస్తే ఈ మధ్య చాలామంది ప్రభుత్వోద్యోగులు రియల్ ఎస్టేట్ బిజినెస్, వడ్డీ వ్యాపారాలు  చేయడం మనకు తెలిసిందే. పోలీసులలో ఇలాంటివి చాలా తక్కువ. ఎక్కడయినా ఔత్సాహిక పోలీసులు ఇతర వ్యాపకాలలోకి వెళ్ళినా వాటిని వారు పోలీసీకరించుకున్నారే తప్ప వృత్తి ధర్మాన్ని నీరు కార్చలేదు. అందుకే రావు గారు మఫ్టీలో మనతో సాహిత్యం గురించి మాట్లాడినా పోలీసు స్వభావం అందులో కనిపించడం హర్షించాల్సిన విషయం. నా మటుకు నేను ఒక విషయం గుర్తించాను. పార్కర్ పెన్‌ను ఆయన పట్టుకునే తీరు మాత్రం లాఠీని పట్టుకున్నట్లే ఉంటుంది. ఆయన పోలీసు హావభావాలు చూడటానికి ముచ్చటగాఉంటాయి. పోలీసులో పోలీసు స్వభావాన్ని చూడాలితప్ప మన కిష్టమయిన లక్షణాలు పోలీసులో చూడాలనుకుంటే డిసప్పాయంట్  కాకతప్పదు. రావు గారి గురించి వినవచ్చే క్రిటికల్ రిమార్క్స్ అన్నీ ఇట్లాంటి డిసప్పాయంట్‌మెంటు నుంచి పుట్టుకొచ్చినవే. ఇతర పోలీసాఫీసర్లకు, సదాశివరావుగారికి ఉండే తేడా రెండు ప్రపంచాల సిద్ధాంతానికి సంబంధించినది. ఇతర పోలీసాధికార్లది నేరప్రపంచం అయితే, రావు గారిది పుస్తకప్రపంచం. ‘పుస్తకం పట్టనివాడు పురుగై పుట్టున్’ అనేది ఆయన శాపం. ఎదురుగా వచ్చేవ్యక్తి పురుగా ,పుస్తకాల పురుగా అనే వాసనని పసిగట్టేయ గలడు. ఇది ఇది నలభై సంవత్సరాల పుస్తక సాహచర్యంతో అబ్బిన విద్య అని ఆయన ఒక సారి చెప్పారు.

‘ఎలా సాధ్యం ’ అని పరిచయం అయిన కొత్తలో అడిగి తిట్లు తిన్నాను.

నా అమాయకత్వం పట్ల నిర్లిప్తంగా ఒక నవ్వు నవ్వి ‘పుస్తకాలు చదివే వాడి దగ్గిర నుంచి కాగితం వాసన వస్తుందోయ్, చవటాయ్’ అన్నారు.

నాకు వెంటనే మరొక సంశయ కలిగింది.అప్పటికే నేను ఔచిత్యం కోల్పోయే ‘రౌండు’లో ఉన్నాను. ఆ ‘రౌండు’లో ఎవరికైనా ధైర్యం వస్తుంది.

‘నిజమే సార్ బాగుంది. ఆ పేపర్ వాసన పుస్తకం వాసనే  కావాలనేముంది.న్యూస్‌పేపర్ వాసన కావచ్చుగదా ’ అని  అడిగేశాను. ఇది సమయస్ఫూర్తితో వేసిన ప్రశ్న. కాదనగలరా?

ఈ సారి ఆయన తన సగం గ్లాస్‌ను ఒక గుక్కలో తాగేసి ,దబీమని గ్లాస్‌ను టీపాయ్ మీదపెట్టి, సిగరెట్ ముట్టించి పకపకా నవ్వారు. నావైపు జాలిగా చూశారు.

‘యు పీపుల్ డు నాట్ రీడ్ బుక్స్, ఇట్స్‌ఎ సీరియస్ ప్రాబ్లం విత్ ది ప్రజెంట్ జెనెరేషన్ ’ అని ఒకవిధమయిన సామాజిక నిస్పృహలోపడిపోయారు.  చాలా చిక్కు ప్రశ్న వేసి ఒకపెద్దపోలీసాఫీసర్‌ను చిక్కుల్లో పడేశానన్న నా అహంకారం క్షణంలో ఆవిరయింది.

ఆయన పోలీసు జాగిలాల గుణం గుర్తుకు తెచ్చేసరికి , ఆయనకు కనిపించకుండా సిగ్గుతో ఒక్క క్షణం తలదించుకున్నాను.

‘నార్మల్లీ ఐ డునాట్ లైక్ పీపుల్ హు డునాట్ రీడ్ బుక్స్. యు ఫస్ట్ రీడ్ బుక్స్‌అండ్ పుట్ కొశన్స్..’ అని ఈజీ ఛేర్‌లోకి వాలిపోయారు. ఒక్క క్షణం మౌనం.

అంతోలోనే ముందుకువాలి గ్లాస్ చేత్తో పట్టుకుని  నా మీద దయతలిచి కాగితాల వాసన చిక్కు ప్రశ్నకు చక్కటి సమాధానం ఇచ్చారు.

‘అవర్ డాగ్స్, యునో అవర్ డాగ్స్ ... దే ట్రాక్ ది క్రిమినల్స్ విత్ దేర్ ఒల్ఫాక్టరీ సెన్స్. ఇంతమంది మనుషులలో ఎవరు దొంగో అవి చేప్పేస్తాయి. ఇది అంతే. ఇఫ్ యు బర్న్ విత్ దట్ పాషన్ యు కెన్ ఈజిలీ డిఫరెన్షియేట్ ది స్మెల్స్ , న్యూస్‌పేపర్ కొక వాసన ఉంటుంది. అకౌంట్ పుస్తకానికొక వాసన ఉంటుంది. టెక్స్‌ట్ బుక్ వాసన వేరే. అట్లాగే నవల వాసన పోయట్రీకి రాదు. సో, ప్రతిపుస్తకానికి ఒక క్యారెక్టరిస్టిక్ స్మెల్ వుంటుంది. ఇది తెలియాలంటే ఒన్‌మస్ట్ రీడ్ బుక్స్... రీడ్...రీడ్. వన్ మస్ట్ బర్న్ విత్ ది పాషన్.’ అన్నారు. ఈ వివరణ నాకు సులభంగా ‘ ఆ’ రౌండులో కూడా అర్థయమేందుకు మరొక ఉదాహరణ కూడా చెప్పారు.

> **సాధారణంగా మనం పుస్తకం చదువుతాం తప్ప  దానికున్న ప్రత్యేక వాసనను ఎపుడూ విస్మరిస్తుంటాం. రావు గారి లాంటి వారు దానిని కూడా గుర్తుంచుకుని దానిని శాస్త్రీయంగా జీవితంలో ప్రయోగించుకుంటుంటారు. అయనకు పుస్తకాల  అమితమయిన వ్యామోహం ఉండేందుకు  కారణం నాకు అపుడు అర్థమయింది. దీనిని తెలుసుకోకుండా, పుస్తకం పేరేత్తగానే రావుగారు లాఠీ చార్జి చేస్తారని ఆరోపించడం నాకు నచ్చదు.**

‘ ఇపుడు ఫరెక్జాంపుల్ మల్లెలు తీసుకుందాం. చెట్టుమీద ఒకరకం సువాసన వేస్తాయి. జడలోపెట్టుకుంటే మరొక  రకం వాసనవేస్తాయి.గుడిలో మాలగా వేస్తే వాటి సువాసన చాలా మారిపోతుంది. దీనికి కారణం ఏ పరిసరాలలో పూలు ఉన్నాయన్నదే. సిమిలర్లీ, కాగితందేనికి వాడామనేదానిని బట్టీ వాసన వస్తుందోయ్..’అనేశారు. ఇది చాలా కన్విన్సింగ్‌గా అనిపించింది.ఎస్ , ఐ మస్ట్ రీడ్ బుక్స్, వేరియస్ బుక్స్ అని ఆ దశలో నిర్ణయించుకున్నాను. రావుగారి మీద నాకు గురి కుదిరేందుకు ఆయనలో ఉన్న ఈ కన్విన్సింగ్ స్వభావమే కారణం.

సాధారణంగా మనం పుస్తకం చదువుతాం తప్ప దానికున్న ప్రత్యేక వాసనను ఎపుడూ విస్మరిస్తుంటాం. రావు గారి లాంటి వారు దానిని కూడా గుర్తుంచుకుని దానిని శాస్త్రీయంగా జీవితంలో ప్రయోగించుకుంటుంటారు. అయనకు పుస్తకాల  అమితమయిన వ్యామోహం ఉండేందుకు  కారణం నాకు అపుడు అర్థమయింది. దీనిని తెలుసుకోకుండా, పుస్తకం పేరేత్తగానే రావుగారు లాఠీ చార్జి చేస్తారని ఆరోపించడం నాకు నచ్చదు. ఇలాంటి వ్యతిరేకులకు నేను దూరంగా ఉంటున్నాను.

అయితే ఎందుకో గాని రావు గారిని ఈమధ్య కలుసుకోవాలనిపించడం లేదు.

దీనికి కారణం ఆయనకు నాకు విబేధాలువచ్చాయనో, గొడవ జరిగిందనో అనుకోకూడదు. ఆయనకు సన్నిహితంగా ఉంటూ ఆయన చదివే పుస్తకాలలో కనీసం శతసహస్రాంశన్నయినా నేను చదవలేకపోతున్నానన్న న్యూనతా భావంతో ఈ మధ్య ఆయనను కలుసుకోవడం మానేశాను. ఈ నిర్ణయానికి రావడానికి దారితీసిన ఒక సంఘటనను చెబుతాను. ప్రతి ఒక్కరూ పుస్తకాలు చదివాలి, చదివితీరాలి అనే ఆశయంతో ఆయన ఎలా సలసలమరుగుతున్నాడో ఈసంఘటన రుజువుచేసింది. అందరిలాగానే నాకూ సదాశివరావుకు ఉన్నసంబంధం వన్‌వే ట్రాఫిక్. వన్‌వే ట్రాఫిక్ కాబట్టి నేను ఎపుడూ శ్రోతనే. దీనిని ఆయనకూడా చాలాస్ట్రిక్ట్‌గా అమలు చేసేవాడు. ‘ఇది దురుసు ప్రవర్తన. ఇతరులకు మాట్లాడే పోలీసులు అవకాశమివ్వరు. ఆ సూత్రమే ఇది’ అనేవాళ్ల జోలికి నేను వెళ్ళదలుచుకోలేదు. నామట్టుకు నాకు ఆయన దగ్గిర శ్రోతగా ఉండటమంటేనే ఇష్టం. ఎందుకంటే ఆయన చాలా పుస్తకాలు చదువుతారు. కేవలం సాహిత్యమేకాదు.ఎకనమిక్స్, అస్ట్రానమీ, ఆంత్రోపాలజీ, చివరకు థర్మోడైనమిక్స్‌ను కూడా చదువుతారు. ఇక చెప్పేవిషయాల జోలికివస్తే ఆయన ఎపుడూ మంచి మాటలే చెబుతారు . తానేమి  చేసి బాగుపడ్డారో దానినే అందరూ చేస్తే అంతా బాగుపడతారనేది ఆయన అభిమతం. ఇందులో నాకు ఎలాంటి పేచీ లేదు. ఆయన చెప్పే మంచి మాటలు గిట్టని వాళ్లని ఆయన దూరాన్నుంచే వాసనతో పసిగట్టి దగ్గిర రాకుండా తన సహాయకుల ద్వారా చర్యలు తీసుకుంటారు.

ఆ రోజు రావుగారు ఎదో ఇన్స్‌పెక్షన్‌కని మావూరొచ్చారు. వచ్చి రాగనే ఆయన నాకు సమాచారం అందించారు. ఈ మధ్య చదువుకున్న మేధావులను  కలవక చాలా కాలమయింది. అందువల్ల రావుగారు వచ్చారని తెలిసినప్పటినుంచి ఆయనను కలుసుకోవాలని మనసు ఉరకలు వేస్తున్నది. దానికి తోడు అంతపెద్ద పోలీసాఫీసర్ స్వయాన ఫోన్‌చేసి నన్ను ఆహ్వానించడంతో ఆఫీసులో కూడా నా కనెక్షన్‌ల మీద చిన్న చర్చ మొదలయింది. ఆయనను కలవడం ఒక ఎడ్యుకేషన్. రావుగారిని ఎవరు ఎపుడు కలుసుకున్నా రెండు లేదా  మూడు ప్రయోజనాల లబ్ధిదారులు అవుతారు. నేను మాత్రం రెండింటికే. ఇందులో ఒకటి జానీవాకర్ బ్లాక్ లేబుల్ విస్కీ. రెండోది బండెడు విదేశీ సాహిత్యం. కనీసం ఆయన ఒక యాభై కొత్తపుస్తకాల పేర్లు , వాటి సమాచారం అలవోకగా చెప్పేస్తారు. ఈ పుస్తకాలు నాలాంటి వాడికి ధర పరంగానే కాదు ఏ విధంగానూ  అందుబాటులో ఉండవు. ఇక కొందరికి ట్రిపుల్ ఫైవ్ సిగరెట్స్‌మూడో లాభం. నిజానికి రావులాంటి హోదా వున్న పోలీసాఫీసర్లు దేశంలో చాలా మంది ఉన్నారు. వాళ్లంతా తీరిక సమయంలో ఏమిచేస్తుంటారు? ఆపనులనే రావుగారు కూడా చేసి మరింత లబ్ధిపొందవచ్చు.

అలాకాకుండా ఇరవై నాలుగ్గంటలు లాటిన్ అమెరికా, ఆఫ్రికా సాహిత్యాన్ని ముందరేసుకుని తలమునకలు కానవసరంలేదు. చదవడం ఆయన జీవన విధానం. తనకు ఎదురుపడే ప్రతిమనిషి అలాగే ఉండాలన్నది ఆయన ఆకాంక్ష. ఏదో ఉదాత్త గుణం ఉంటే తప్ప ఒక పెద్ద పోలీసాఫీసర్ ఇలాంటి రాబడిలేని వ్యాపకానికి పూనుకోరు గదా అన్నది నా వాదన. దురదృష్టవశాత్తు నా వాదనను మిత్రులు అంగీకరించడంలేదు. 'ఫలానా పోలీసాఫీసర్‌కు' పెట్‌డాగ్స్' హాబీ. ఆయన బంగళాలో కనీసం ఇరవై అయిదు పెట్స్ ఉంటాయి. తీరక సమయం అంతా ఆయన వాటితో మాట్లాడుతూ గడిపేస్తాడు. ఎపుడయినా ఒక కుక్కకి వొంట్లోబాగా లేకపోతే ఆరోజు ఆయన తల్లడిల్లి పోతారు. మరోపోలీసాఫీసర్‌కు బోన్సాయ్ వృక్షాల పెంపకం అలవాటు .అదే ఆయన జీవన విధానం. ఒక మొక్క వాడిపోతే ఆయన విలవిలలాడిపోతారు. ఇలాంటిదేరా బాబూ మీ రావు పుస్తకాల పిచ్చి ' అని కొంతమంది అన్నపుడు నాకు చాలా బాధ కలిగింది. ఈ గొడవంతా వదిలేద్దాం. రావుగారికి పుస్తకాలు కొని చదివి వాటిలోని సంగతులను ప్రచారం చేయకపోతే నాలాంటి వాళ్లు మూఢవిశ్వాసాలతో, అజ్ఞానాంధకారంలోనే మగ్గిపోతుంటారని నా గట్టినమ్మకం. నా పాండిత్యం రావు గారి వంటి వారి చలవే. దీనికి నేను గర్వపడతాను. ఇలాంటి ప్రయోజనం ఉంది కాబట్టే నేను రావుగారి వెంటపడ్డానని ఆమధ్య ఒక చిన్నప్రచారం జరిగింది. నేను దానిని ఖాతరు చేయలేదు. ఆ రోజు రావుగారిని కలుసుకునేందుకు నేను గెస్ట్ హౌస్‌లోకి వెళ్లేసరికి బాగా ఆలస్యంఅయింది. బయట ఉన్న సెంట్రీని 'సారున్నారా' అని అడిగాను. నాపేరు అడిగి వెంటనే సెంట్రీ నన్ను లోనికి పంపించాడు. అంటే అప్పటికే నాగురించి ఆయన తగు ఉత్తర్వులిచ్చారు. గదిలోకి వెళ్లే ముందు కొంచెం గుండెదడ ప్రారంభమయింది. ఎందుకంటే ఈ మధ్య ఒక్క పుస్తకం కూడా చదవలేదు. పుస్తకాలు కొనడం అనేది చాలా ఖరీదయిన వ్యాపకం. ఏపుస్తకం మార్కెట్లోకి వచ్చిందనే దానికంటే ఈ రోజు చేస్తున్న ఉద్యోగం రేపు ఉంటుందా ఊడుతుందా అనే సమస్యతోనే నా తీరిక సమయం అంతా గడిచిపోతుంది. ఇలాంటపుడు పుస్తకాలమీదకు ధ్యాస పోవాలంటే ఆమనిషి స్థితప్రజ్ఞుడు కావాలి. ఎవరయినా కలిస్తే తాజాగా చదివిన పుస్తకాల గురించి రావుగారు వాకబు చేస్తారు. (ఆయనను విమర్శించే వాళ్లు దీనిని 'ఇంటరాగేషన్' అంటుంటారు. )

'సరే చూద్దాం' అని లోనికి ప్రవేశించాను.వెంటనే 'ఎస్.. కమిన్ ' కంచు కంఠం మ్రోగింది. ఎందుకో ఈ కంఠమే పోలీసులందరికి ఉంటుంది. పోలీసు సెలెక్షన్‌లో కంఠస్వరం కూడా చూస్తారా?

'ఏమయ్యా బాగున్నావా..ఎంతకాలమైంది ఇక్కడికొచ్చి. ట్రాన్స్ ఫరయినపుడు ఒక్క మాట కూడా చెప్పలేదే. ప్రపంచాన్ని కూడా పట్టించుకోవాలి. చుట్టూ ఉన్న మనుషుల్ని చూస్తుండాలి. పుస్తకాలు చదువుతూ ఉండాలి.' అని ఆయన వాత్సల్యం చూపారు.



ఆయనకు ఎదురుగా ఉన్న సోఫా మీద కూర్చున్నా. నా పక్కనే ఏడెనిమిది కొత్తపుస్తకాలు ఉన్నాయి. నిజానికి అవి నిజంగానే నవల వాసన వేస్తున్నాయి. ఒక పుస్తకం వైపు తేరిపార చూశాను. 'అన్‌ఫనిష్‌డ్' అనే పెద్ద అక్షరాలు కనిపించాయి. ఈ లోపు ఆయన మరొక ఖాళీ గ్లాసులోకి జానీవాకర్ వంపుతూండటం ఓరకంట చూశాను. గ్లాసులోకి సోడావంపుతూ 'తీసుకుంటున్నావా' అని అడుగుతూ నావైపు చూశారు. నేను సమాధానం చెప్పకుండా అంగీకారంగా చిరునవ్వు నవ్వాను. తర్వాత మళ్లీపుస్తకం మీదకు చూశాను .అన్‌ఫినిష్‌డ్ కు పైన 'ది గ్రేట్ ' అని కింద 'నావెల్స్' అని ఉంది.

ఈ లోపు రెండు ఐస్ ముక్కలు కూడా తానే వేసి 'టెకిట్ ఫస్ట్ ' అన్నారు.

గ్లాస్ అందుకుని ఒక సిప్ చేశాను. రియల్లీ ఫెంటాస్టిక్.

మంచుకొండకి నాలుక కొన తగిలించినట్లు సోడా కలిసిన జానీవాకర్ జివ్వున లాగింది.

'ఇక చెప్పండి' అన్నట్లు గర్వంగా, సంతృప్తిగా గ్లాస్ టీపాయ్ మీద పెట్టాను.

ఆయన ట్రిపుల్ ఫైవ్ అంటిస్తున్నారు. మనం మాట్లాడేందుకు దొరికే అవకాశాలవే.

అందుకే వెంటనే

'ఈ మధ్య వాసు గారిని కలిశారా' అన్నాను.

'నో..ఆఫ్‌లేట్ ఐ స్టాప్డ్ మీ టింగ్ వాసు. హి ఈజ్ ఎ డిఫరెంట్ వరల్డ్ ' ఇక ఆ పరామర్శ అక్కడితో ఆగిపోయింది.

మళ్లీ ఆయనే అందుకున్నారు.

'...సీ ..వాళ్లు చదువు మానేశారు. కొత్తపుస్తకాలు చదవని వ్యక్తితో మాట్లాడేందుకు సబ్జక్టేమి ఉంటుంది. కొత్త విషయాలు వాళ్లు చెప్పరు. మనలను చెప్పనీయరు. సో ఐ స్టాప్డ్ మీటింగ్ సచ్ పీపుల్' ఒక పెద్ద దమ్ము లాగి ఆకాశంలోకి పొగ వదిలారు.

నేనేమీ అనలేదు.

'...ఈ మధ్య ఒక కొత్తపుస్తకం కొన్నానోయ్. దటీజ్ ' మాస్టర్ ఆఫ్ ఇల్యూజన్' . ఇటీజ్ అబౌట్ ఎ పర్సన్ హు లివస్ ఇన్ ఏన్ ఇల్యూజన్ విచీజ్ హిస్ వోన్ క్రియేషన్. ప్రాబ్లం ఏమిటంటే వాడు మిగతా వాళ్లందరిని ఈ ఇల్యూజన్‌లో బతకాలంటాడు. ఇది ఎలా సాధ్యం . గొప్ప పుస్తకమోయ్. దీనిని అర్థం చేసుకునేందుకు నేను సైకాలజీ ,సోషియాలజీ, ఆంత్రోపాలజీ పుస్తకాలను తిరగేయాల్సివచ్చింది.

అంటే ఒక పుస్తకం అర్థం చేసుకోవడానికి ఎన్ని పుస్తకాలు చదవాలో తెలుసా. అందుకే ఈ మధ్య నేను మన మిత్రలందరికి ఒకటే సలహా ఇస్తున్నా. ఒక్క సాహిత్యం సరిపోదు..మీరు ఎకనమిక్స్ చదవండి. ధర్మోడైనమిక్స్ చదవండి. అగ్రోనమీ కూడా ఒక్కొక్కసారి అవసర పడవచ్చు. కాబట్టీ దానినీ చదవండి అని అందరి కి చెబుతున్నా. ఎలావుంది ఇది....ఎందుకంటే ' ది ట్రాప్ ' వియత్నాం వార్ మీద వచ్చిన బెస్ట్ నావెల్, చదివాను. వియత్నాంలో చిక్కుకున్న అమెరికన్ వార్ ప్రిజనర్ ఒకతను దీనిని రాశాడు.

**(తరువాయి 23వ పేజీలో)**

# స్వభావం

(14వ పేజీ తరువాయి)

ఇది చదువుతూంటే మధ్యలో నాకు 'వార్ రిపోర్టింగ్ ' రెఫర్ చేయాల్సిన అవసరమొచ్చింది. వెంటనే హెమింగ్వే 'వార్ రిపోర్ట్స్' పంపవయ్యా అని మన కోటేశ్వరరావుకు ఫోన్ చేశాను. దట్ ఫెలో డిడింట్ రెస్పాండ్. సో, ఐ హేడ్ టు రైట్ ఏన్ ఎమెరికన్ పబ్లిషర్ ఫర్ ది బుక్. ఇది చదివితే గాని అది అర్థం కాలేదు. ఇపుడేమంటావు. కాబట్టి పుస్తకం అనేది సెపెరేట్ ఐడెంటిటి ఉన్న అబ్జక్టు కాదు. అంది ఒక పెద్ద చెయిన్‌లో చిన్న లింక్. ఈ విషయం తెలుసుకోవడానికి నాకు ఎన్ని పుస్తకాలు చదివాల్సి వచ్చింది. సో,వన్ మస్ట్ బర్న్ విత్ దట్ పాషన్ టు రీడ్ బుక్స్. ముఖ్యంగా నీలాంటి కుర్రవాళ్లు బాగా చదవాలోయ్. గ్రాజువల్‌గా చదివేశేయ్. మొదట్ లాటిన్ అమెరికా వెళ్లిపో. తర్వాత

ఆఫ్రికా వచ్చేయ్. ఈ రెండు అయిపోతూనే రష్యన్ క్లాషిక్స్ , రియల్లీ గ్రేట్. ముఖ్యంగా గొగోల్ డెడ్ సోల్స్ చదివేటపుడు ఎమయిందో తెలుసా. రిజస్ట్రేషన్ ప్రస్తావన వచ్చింది. వెంటనే ఇండియన్ రిజస్ట్రేషన్ యాక్ట్ మొత్తం తిరగేశా...'

ఈ లోపు తెలియకుండానే నా గ్లాస్ ఖాళీ అయింది. మళ్లీ రెండు గ్లాసులను రావు గారే నింపారు. గ్లాసు ను అందించి జీడిపప్పు ట్రే నా ముందుకు జరిపారు.

'వెల్ ...హౌమెనీ ఆఫ్ అజ్ నో అబౌట్ అవర్‌వోన్ ట్రయిబ్స్, అండ్ దేర్ బ్యూటీ, పోయిట్రీ అండ్ రిథమ్ ఇన్ దేర్ లైఫ్ ఇన్ ది ఫారెస్ట్ . ఎల్విన్ ఎంత గొప్పగా చెప్పాడోయ్. కారణమేమిలేదు. ఎల్విన్ హిమ్‌సెల్ఫ్ వాజ్ ఎ పోయిట్....'

బెల్ నొక్కాడు. వెంటనే ఒక కానిస్టేబుల్ పరిగెత్తుకుంటూ వచ్చాడు.

'క్యాంటిన్‌కు వెళ్లి వేడి వేడి ఆనియన్ పకోడి తీసుకురమ్మని చెప్పు ' పురమాయించాడు.

'ఈమధ్య నేను రాసిన కథలేమయినా చదివావా?చదవలేదు. చదివివుంటే వస్తూ నే నువ్వే గుర్తు చేసేవాడివి. చదవాలోయ్.బాగా చదవాలి. ఇపుడు చదవకపోతే ఎపుడు చదువుతావ్. ఏమీ చదవకుండా ఎలా బతుకుతున్నావ్.'

రావుగారి గ్లాస్ మళ్లీ ఖాళీ అయింది.అది ఏ రౌండో నాకు తెలియదు.ఎందుకంటే

నేనొచ్చేటప్పటకికే ఆయన 'రౌండ్స్' లో ఉన్నారు.

'ఉ..కానీయ్ ' నన్ను ఆజ్ఞాపించారు.

నేనేమీ అనలేక పోయాను.

రెండు గ్లాసుల మళ్లీ నిండాయి.ఈ లోపు కానిస్టేబుల్ మళ్లీ పరిగెత్తుకుంటూనే వచ్చినట్టున్నాడు. ఆయాసం అణచుకునేందుకు చేస్తున్న ప్రయత్నం కనబడుతున్నది. ఆవెనకే క్యాంటిన్ మేనేజర్ వచ్చాడు.

'సార్ ఈవెనింగ్ స్నాక్స్ ఉండవు . డిన్నర్ మాత్రం ఉంటుంది. కాకపోతే, నాన్‌వెజ్ దొరుకుతుంది ' అని వినయంగా నిలబడ్డాడు. దీనిని రావుగారు పట్టించుకోలేదు. చిన్న చిన్న విషయాలను ఖాతరు చేయకపోవడం ఆయన స్వభావం.

'వెళ్లు.. రెండు పేట్లు ఆనియన్ పకోడి తీసుకురా. ఆనియన్స్ ఎక్కువగా వేసి రోస్టు చేసి తీసుకురా. వేడిగా ఉండాలి. వెళ్లి చేయించు.' కొంచెం ఆజ్ఞ ధ్వనించింది. ఏదో చెప్పపోయి, లాభంలేదులే అనుకున్నట్లు క్యాంటిన్ మేనేజర్ వెళ్లిపోయాడు. ఆవెనకే కానిస్టే బులూనూ.

'రీడింగ్ అనేది వ్యవసనమోయ్. రోజూ ఒక కొత్తపుస్తకం చదవాలి ,లేకపోతే ఆరోజు జీవించినట్లుండదు. రోజూ చదవాలి. చదివితీరాలి. అంతే. మరి మీరో ఏమీ చదవరు. నిన్ను చూస్తే జాలివేస్తోంది. ఈ మధ్య ఏమీ చదివినట్లు లేవు. హౌ ఈజ్ ఇట్ పాజిబుల్ మిస్టర్ నాగరాజ్ . యు మస్ట్ బర్న్ విత్ ది పాషన్ .....'

ఈ రోజు ఆయన నామీద పడుతున్నాడేమిటి అని కొంచెం విసుగనిపించింది. అంటే నామీద జానీవాకర్ ప్రభావం పడ్డట్లుంది? నిజానికి అప్పటికే రెండు రౌండు పూర్తయ్యాయి. నాతో నిమిత్తం లేకుండా రావుగారు తనపని తాను చేసుకుపోతున్నట్లే లోపల జానీవాకర్ తన పని తాను చేస్తున్నది. ఇక ముందుకు పోకూడదనుకున్నాను. ఈ లోపు ఖాళీ చేతులతో క్యాంటిన్ మేనేజర్ వచ్చాడు. నేరస్థుడు పోలీసాఫీసర్ దగ్గిర నిలబడుకున్నపుడే వ్యక్తమయే జంకు అతనిలో కనబడుతూ ఉంది.

'ఇపుడు పకోడి సాధ్యంకాదు సార్. రాత్రి పదిదాటింది. మమూలుగా కనీసం ఇరవై ప్లే ట్ల ఆర్డర్ ఉంటే గాని ఇక్కడ పకోడి చేయరు సార్ .'

'ఈమధ్య నేను రాసిన కథలేమయినా చదివావా?చదవలేదు. చదివివుంటే వస్తూ నే నువ్వే గుర్తు చేసేవాడివి. చదవాలోయ్. బాగా చదవాలి. ఇపుడు చదవకపోతే ఎపుడు చదువుతావ్. ఏమీ చదవకుండా ఎలా బతుకుతున్నావ్.'

ఈసారి రావుగారు కొంచెం తీక్షణంగా చూశారు.

'సాధ్యమవుతందమ్మా. నేను చెప్పానని మీ ప్రొప్రయిటర్‌కు చెప్పి పావుగంటలో పకోడి తీసుకు రావాలి . పో..పో..'

మళ్లీ ఒక వివరణ ఇచ్చేందుకు ఆతనికి అవకాశమివ్వకుండా నావైపు తిరిగి

' సీ దీస్ పీపుల్. పకోడి చేస్తే డబ్బులొస్తాయి. కాని వాడు టైం అయిపోయిందంటాడు. దీస్ ప్యూపుల్ డునాట్ నో హౌటు ఎర్న్ మనీ. మన ఎకానమీ ఎందుకు ఇలా తగలబడింది. వి డునాట్ నో హౌ టు మేక్ మనీ. సీ ది జపనీస్, కొరియన్స్...,వేరీజ్ దిస్ కంట్రీ లీడింగ్ ' సామాజికి నిస్పృహతో, బాధతో నిట్టూర్చారు రావుగారు. నాకు నిజమేనని పించింది. ఈ ఆవేదనలోనే ఆయన తన గ్లాస్ ఖాళీ చేసి మళ్లీ నింపుకుని సీసాకు మూత బిగించి దూరంగా పెట్టారు. అంటే సెషన్ ముగుస్తున్నదన్న మాట. మూడో రౌండుతో నేను కుస్తీపట్టడం ఆయన గమనించి నట్టున్నాడు. నన్ను మొహమాట పెట్టలేదు. పకోడిలకు టైం అయిపోయందని క్యాంటిన్ వాడు ఇచ్చిన షాక్ నుంచి ఆయన ఇంకా కోలుకోలేదు. అంతలోనే మళ్లీ క్యాంటిన్ మేనేజర్, ఆ వెనకే కాన్‌స్టేబుల్ వచ్చారు.

'సారీ సార్ ఇపుడు వేయడం వీలుకాదు' నేరం ఒప్పుకున్నంత దీనంగా క్యాంటీన్ మేనేజర్ విన్నవించుకున్నాడు.

'కాదు...కుదరదు.. పకోడి తీసుకురావాలి .నీకుఎంత ఖర్చవుతే అంతతీసుకో ' పట్టుబట్టారు రావుగారు.

ఇందులో పోలీసు స్వభావం ఉందేమోనని నాకు అనుమానం వేసింది. క్యాంటిన్ మేనేజర్ వెళ్లిపోయాడు. రావుగారు బాగా అప్‌సెట్ అయ్యారు. సిగరెట్ ను గుప్పు గుప్పున పీలుస్తున్నారు. మా ఇద్దరి మధ్య మాటలు స్థంభించా యి. నా మూడో రౌండు పూర్తయే దశలో ఉంది. గది గోడలు కొద్ది గా కదిలినట్లు అనిపిస్తున్నది. అలా అనిపించినపుడు నేను టైం చూసుకుంటాను . పదకొండు దాటింది. ఇది ఆయన కంటబడింది.

'ఏమోయ్ ఏంటి ఆలస్యమయిందా' అన్నారు.

'లేదు...లేదు' తత్తరపాటుతో అన్నాను. మా సంభాషణ పున:ప్రారంభం కాలేదు. నామనుసు రావు గారు చెప్పిన విదేశీ పుస్తకాల చుట్టూ,మాస్టర్ ఆఫ్ ఇల్యూజన్ చట్టూ తిరుగుతూ ఉంది. ఎలాగయినా సరే పుస్తకాలు కొనాలి. చదవాలి అనే నిర్ణయానికి వచ్చాను. పుస్తకాలు చదవడం వల్ల నష్టం లేదు. ప్రయోజనమే. దీనికి రావు గారే సాక్ష్యం. ఇంతవరకు జీవితాన్ని వృధాచేసుకున్నాన్న జ్ఞానం కళ్లముందు పొరలు పొరలుగా కమ్ముకువస్తున్నది. సిగ్గుతో , నిషాతో నాతల వాలి పోతున్నది. సరిగ్గా అపుడు మళ్లీ ప్రవేశించాడు క్యాంటిన్ మేనేజర్.

ఈ సారి జరగకూడనిదేదో జరుగుతుందా?

'సారీ సార్ .పకోడి వేయడం కష్టం . కావాలంటే ఆమ్లెట్ వేస్తాం. మరోలా అనుకోకండి.మాస్టర్ వెళ్లిపోయాడు...' ఇక మీయిష్టం అన్నట్లు అతను చేతులు కట్టుకుని నిలబడ్డాడు.

ఒక్కక్షణం రావుగారు అతనిని కింది నుంచి పైకి చూశారు.

'ఏమోయ్ మీ ప్రోప్రెయిటర్‌కు బుద్ధుందా? మెదడుందా తలకాయలో? మీరేమయినా ఫ్రీగా ఇస్తున్నారా? ఇపుడెంతవుతున్నది టైం .పదకొండా .పదకొండుగంటలకే క్యాంటిన్ కట్టే స్తారయ్యా? ఎవరయ్యా మీప్రొప్రయిటర్? ...' కానిస్టేబుల్ వైపు తిరిగి

'...వాడెవడు...ప్రోప్రయిటర్ పేరు ఏమిటో కనుక్కో' అని ఆజ్ఞాపించారు.

'గెటవుట్...గెటవుట్..' అని మేనేజర్‌ని కసురుకున్నారు.

రావుగారి మనసు కకావికలయింది. నేను మళ్లీ వాచ్ చూసుకున్నా. గడియారం డయల్ మీద పల్చటి మస్లిన్ క్లాత్ కప్పినట్లుగా ఉంది. టైం సరిగ్గా కనిపించలేదు. గడియారంలోని అంకెలన్నీ ముళ్లుల్లాగా కనిపంచాయి. గుండె గుబేలు మంది. నేను హద్దుమీరినట్లున్నానా? అనుమానం వచ్చింది. ఇక బయట పడాలి. ఎలా?

' సీ హౌ దీస్ రాస్కెల్స్ ఆర్ బిహేవింగ్. హియర్ ఇన్ ఇన్ దిస్ కంట్రీ వి హేవ్ నో వర్క్ కల్చర్. యు నో... ది ప్రాబ్లమ్ విత్ దీస్ పీపుల్... మిస్టర్ నాగరాజ్.., దె డునాట్ రీడ్ బుక్స్ ... దటీజ్ ది ప్రాబ్లమ్ ...సోల్ ప్రాబ్లమ్ .. దె డునాట్ ...'

ఈ ఒక్కమాటతో నాతలకెక్కిన జానీవాకర్ పాదరసంలా కిందికి రివ్వున జారి పోయింది. ఇక వాక్యం పూర్తి చేసేందుకు ఆయనకు అవకాశం ఇవ్వలేదు. 'వెళ్తాను సార్ ,రేపు మళ్లీ కలుస్తాను ' అని చెప్పి బయట పడ్డాను. నాలాంటి చిన్న చిన్క

ఉద్యోగులు మొదలుకుని క్యాంటిన్ వర్కర్ల దాకా అందరూ ప్రపంచ సాహిత్యం చదవాలన్న ఆయన మహోన్నత ఆకాంక్షకు నమస్కారం పెట్టాను. మళ్లీ ఆయనను కలుసుకునే ప్రయత్నం చేయలేదు.